



తలకొరివి పెడుతున్న అక్క కూతురు యాదమ్మ, జానమ్మ (ఫైల్)

ఆశ ఓడింది.. శ్వాస వదిలింది..

- ఆఖరి యాత్ర మెట్టింట జరగాలని కోరిక
- అందుకూ దయ చూపని కాఠిన్యం
- తలకొరివి పెట్టిన అక్కకూతురు

దుబ్బాక/తొగుట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆమె భర్త పేరిట ఉన్న ఆస్తులు విడతలవారీగా రెండో భార్య, ఆమె పిల్లలు రాయించుకున్నారు. తనకు ఆస్తులు వద్దు ఆ ఇంట్లో ఇంత చోటిస్తే చాలు. అది కుదరకపోతే తన ఇంటి నుంచి అంత్యక్రియలైనా జరపాలన్న ఆమె ఆశ ఓడింది. శ్వాస వదిలింది.

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గౌరాయిపల్లికి చెందిన నర్ర యాదవరెడ్డి మొదటి భార్య జానమ్మ(58)కి పిల్లలు లేరు. దీంతో 25 ఏళ్ల క్రితం యాదవరెడ్డి బాలామణిని రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటికే బాలామణికి ఓ కుమార్తె ఉంది. తర్వాత మరో కుమార్తె పుట్టింది. జానమ్మ, బాలామణి ఇద్దరూ కలిసే ఉండేవారు. బాలామణి ఇద్దరు కుమార్తెల వివాహాలూ జానమ్మ, బాలామణి కలిసే చేశారు. నర్ర యాదవరెడ్డి, జానమ్మలను నాలుగేళ్ల క్రితం అనారోగ్యం వెంటాడింది. జానమ్మ కేన్సర్ బారిన పడటంతో ఆస్పత్రికి తీసుకెళ్లే వారూ లేక.. ఇంటి వద్దే ఉండిపోయింది. చివరి దశలో ఉన్న జానమ్మ ఆర్‌వీఎం ఆస్పత్రిలో ఉండగా, ఆమె అక్క కుమార్తె తూంకుంట్ల యాదవ్వ బాగోగులు చూసుకునేది. వైద్యులు ఇంటికి తీసుకెళ్లాల్సిందిగా చెప్పడంతో.. యాదవ్వ స్వగ్రామం అయిన తొగుట మండలం గుడికందులకు తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ వద్దకు వెళ్లి.. తనకు ఆస్తులు వద్దు.. తన తదనంతరం కనీసం గౌరవ ప్రదంగా మెట్టింటి నుంచి సాగనంపేందుకు సాయం చేయాలని ప్రాథేయపడినా కనికరించలేదు. చివరకు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాదర్బార్‌లో విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. కోర్టుకు వెళ్లాల్సిందిగా అక్కడ సలహా ఇచ్చారు. జానమ్మ పరిస్థితి చూసి.. కొమురవెల్లి ఎస్‌ఐ రాజు స్పందించి.. ఆ ఇద్దరు కుమార్తెలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. సివిల్ సమస్య కావడంతో ఆయన సొంతంగా జానమ్మ చేతిలో కొంత డబ్బు పెట్టి పంపించారు. ఆమె సోమవారం రాత్రి చనిపోవడంతో అంత్యక్రియలు చేసేందుకు రెండో భార్య కుమార్తెలు ముందుకు రాలేదు. గ్రామస్థులు ఆగ్రహంతో భర్తను చివరి నిమిషంలో తీసుకువచ్చారు. తలకొరివి పెట్టేందు ఎవరూ ముందుకు రాకపోవడంతో తూంకుంట్ల యాదమ్మ తలకొరివి పెట్టింది.



సామూహిక కుంకుమార్చన

సిద్దిపేట కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం చివరి మంగళవారం సందర్భంగా పట్టణంలోని శ్రీగౌరీ నీలకంఠేశ్వర దేవాలయంలో నీలకంఠ సమాజం, మహిళ విభాగం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అంతకుముందు మంగళ గౌరీ వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.



కాసుపత్రులపై కొరడా

వైద్యం ముసుగులో అందినకాడికి దండుకుంటున్న ఆస్పత్రులు, అవసరం లేకున్నా టెస్టులంటూ ప్రజల జేబులు కొల్లకొడుతున్న డాక్టర్లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు సిద్దిపేట జిల్లాలో కోకొల్లలు. అడిగేవారు లేక, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. కొత్త డీఎంహెచ్‌వో వీటిపై దృష్టిసారించినట్లు తెలుస్తున్నది. ఆయన ఆదేశాల మేరకు అధికారులు ఇటీవల వరుస తనిఖీలు చేపడుతూ నిబంధనలు పాటించనివాటిపై చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు పాలీ క్లినిక్‌లను సీజ్ చేశారు. ఇదే పాలసీని తుదిదాకా కొనసాగిస్తారా.. ఎప్పటిలాగే మధ్యలోనే చేతులెత్తేస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- కొత్త డీఎంహెచ్‌వో ఆదేశాలతో వరుస తనిఖీలు
- ఇప్పటికే పలు పాలీ క్లినిక్‌లు సీజ్ చేసిన అధికారులు
- సిద్దిపేటలో ఇష్టారాజ్యంగా ప్రైవేటు వైద్యం
- బడా ఆస్పత్రులపైనా చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, నవంబరు 26 : 'వైద్యోనారాయణ హరి' అంటూ వైద్యులను దేవుళ్లతో సమానంగా భావిస్తుంటారు. తల్లిదండ్రులు జన్మనిస్తే పునర్జన్మనిచ్చే శక్తి కేవలం వైద్యులకే ఉంది. ఇలాంటి వైద్యవృత్తిని, వైద్యసేవలను ధనార్జనే ధ్యేయంగా కొంతమంది అభాసుపాలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో వ్యాపార దృక్పథంతో ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులను ఏర్పాటు చేసి ఇష్టమొచ్చినట్లు వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు ఇలాంటి ఆస్పత్రులపై గతంలో వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నా.. ఆ తర్వాత షరా 'మామూలే' అయిపోయింది. ఇటీవలే కొత్తగా వచ్చిన డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్ ఆదేశాలతో మళ్లీ తనిఖీలు మొదలుపెట్టారు. అనుమతులు లేని, నిబంధనలు పాటించని ప్రైవేటు క్లినిక్‌లపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

ప్రజారోగ్యంతో వ్యాపారం..

జిల్లా వ్యాప్తంగా మెజార్టీ ప్రైవేటు ఆసుపత్రులు ప్రజారోగ్యాన్ని వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. జనాన్ని ఆకర్షించేలా నాణ్యమైన వైద్యమంటూ ప్రచారం చేస్తూ విచ్చలవిడిగా అక్రమంగా ఆర్జిస్తున్నాయి. ఎన్నో ఆస్పత్రులు పూర్తిస్థాయిలో అనుమతులు లేకుండానే నడుస్తున్నాయి. ముఖ్యంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో పేరు మోసిన పది మంది డాక్టర్లను మినహాయిస్తే మెజార్టీ వైద్యులు కాసులే లక్ష్యంగా అమాయక ప్రజలను దోచుకుంటున్నారు.

పేరొకరిది.. పెత్తనమొకరిది..

సిద్దిపేట మాడ్రన్ బస్టాండ్ సమీపంలోని ఓ ఆస్పత్రిలో వైద్యుడికి బదులు ఫిజియోథెరపిస్టు రోగులను పరీక్షించినట్లు తెలిసింది.

- మిగతా 8వ పేజీలో...



హోమియో క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

రాంగ్‌రూట్‌లో వచ్చిన బస్సు.. ఢీకొట్టిన ట్రాక్టర్

- బస్సు డ్రైవర్ పరిస్థితి విషమం



8

నిఘానేత్రాలపై చిన్నచూపేలా!?

- పని చేయని సీసీ కెమెరాలు
- కేసుల పరిష్కారంలో వాటి పాత్ర కీలకం
- మరమ్మతులు చేపట్టడంలో జాప్యం

8



విధుల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాక 100 పడకల ఆస్పత్రిలో సమీక్ష

8



కూరల్లో కరివేపాకు

- విద్యార్థుల మధ్యాహ్న భోజనంలో...
- బడుల్లో మొక్కల పెంపకం
- స్థానిక నర్సరీల ద్వారా అందజేత



మద్దూరులోని కస్తూర్బా పాఠశాలలో కరివేపాకు మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

మద్దూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కరివేపాకు వంటలో రుచి పెరగడంతోపాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఇందులో కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, యాంటి ఆక్సిడెంట్లు, బీ విటమిన్‌తో పాటు కెరోటిన్ పుష్కలంగా లభిస్తాయి. ప్రధానంగా కొలెస్ట్రాల్‌ను తగ్గించి జీర్ణ ప్రక్రియను మెరుగుపర్చే గుణం కరివేపాకులో ఉంది. ఇంతటి ప్రాధాన్యమున్న కరివేపాకు విద్యార్థుల దరి చేర్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందుకోసం బడుల్లో కరివేపాకుతోపాటు మునగ మొక్కల్ని పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నుంచి వాటిని పాఠశాలలకు అందించనున్నారు.

మధ్యాహ్న భోజనం ద్వారా...

జిల్లాలో ఉన్న 638 ప్రాథమిక, 113 ప్రాథమికోన్నత, 227 ఉన్నత పాఠశాలల్లో 79,157 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటితో పాటు 14 మోడల్, 23 కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో 12,900 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ మధ్యాహ్న భోజనంలో కరివేపాకు ప్రయోజనాలు అందనున్నాయి. వంటల్లో తప్పనిసరిగా కరివేపాకును వినియోగించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలందాయి.

మొక్కలు పెంచుతున్నాం..



కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో కరివేపాకు మొక్కల్ని నాటించి పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామపంచాయతీ సెక్రటరీల సహకారంతో మధ్యాహ్న భోజన వంటకాల్లో వినియోగించాలని ఇప్పటికే ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చాం.

- ఎస్.రాంమోహన్ ఎంపీడీవో మద్దూరు

గ్రామాల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ మను చౌదరి

కొండపాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన అవకాశాల స్ఫూర్తిగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కలెక్టర్ ఎం.మనుచౌదరి అన్నారు. మంగళవారం కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్నారు. గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ నుంచి బందారం వరకు నిర్మించనున్న మట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, సెట్విన్ అధికారి అమీనా, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలను సత్కరిస్తున్న కలెక్టర్

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

- బెల్ట్ షాపులను నివారించాలి
- సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా పోలీసు అధికారులకు సీపీ డాక్టర్ బి.అనురాధ ఆదేశించారు. మంగళవారం ఆమె కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అమ్మాయిలు, మహిళల మిస్సింగ్‌లపై వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలన్నారు. డిసెంబరు 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బెల్ట్ షాపులపై నివారణకు కృషి చేయాలన్నారు. వాటి నిఘా పెట్టి నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలన్నారు. డయల్ 100 కాల్స్‌పై అలసత్వం పనికిరాదన్నారు. రాత్రి సమయాల్లో రోడ్లపై వాహనాలు నిలపకుండా చూడాలన్నారు. మత్తు పదార్థాలు, పేకాట, జూదం, తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కుపాదంతో అణిచివేయాలన్నారు. మహిళల రక్షణకు పెద్దపీట వేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, సీసీఎస్ ఏసీపీ యాదగిరి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, శ్రీధర్ గౌడ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ కమలాకర్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ డాక్టర్ బి.అనురాధ

మల్లన్నా.. ఈసారెవరన్నా..!



- 57సంవత్సరాలు... 65 మంది ఈవోలు
- మరో నెలరోజుల్లో ప్రస్తుత ఈవో రిటైర్డ్
- ఆలయ చరిత్రలో నాలుగేళ్లు పనిచేసిన ఏకైక వ్యక్తి

చేర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ ఈవో బాలాజీశర్మ డిసెంబరు నెలాఖరులో రిటైర్ కానున్నారు. గత ప్రభుత్వం పెంచిన మూడేళ్ల కాలపరిమితి పూర్తికానుంది. ఇదే క్రమంలో మల్లన్న కల్యాణం డిసెంబరు 29న జరగనుండడంతో ఈవోగా ఎవరిని నియమిస్తారన్నదానిపై ఆసక్తి నెలకొన్నది. రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రాలలో ప్రధానమైన మల్లన్న ఆలయం తెలంగాణ, జానపద సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా వెలుగొందుతున్నది. యేటా రికార్డుస్థాయిలో ఆదాయం గడిస్తున్నప్పటికీ స్థానిక పాలనా అంతర్గత వ్యవహారాలు, రాజకీయ పరిణామాలతో అదేస్థాయిలో వివాదాలకూ నిలయంగా మారింది.

65మంది ఈవోలు..

దేవాదాయశాఖ పరిధిలోకి రాక పూర్వం మల్లన్న ఆలయ ఆదాయం కేవలం రూ.4వేలు ఉండగా, డిప్యూటీ కమిషనర్ హోదాతో సుమారు రూ.20 కోట్లకు పైగా చేరుకుంది. దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చిన అనంతరం 1967లో కృష్ణారావును తొలి కార్యనిర్వహణాధికారిగా నియమించగా, ప్రస్తుతం 65వ ఈవోగా బాలాజీశర్మ కొనసాగుతున్నారు. 57 సంవత్సరాలలో 65 మంది ఈవోలను నియమించగా, సగటున సంవత్సరానికి ఒకరు చొప్పున కూడా సక్రమంగా పనిచేయలేదు. వీరిలో అధికశాతం రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నవారిని నియమించడం, ఇక్కడి స్థితిగతులు, ఆలయ నిర్వహణ తీరును అర్థంచేసుకునే సరికే ఉన్న సమయం గడిచిపోవడంతో అభివృద్ధి అటకెక్కుతూ వచ్చింది. దాతలు ఎంతో మంది ముందుకువస్తున్నా, వారిని గుర్తించకపోవడం, యేటా జాతరవచ్చే సరికి కొత్త ఈవో మారుతుండడం వలన వెనకబాటుకు గురైంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చొరవతో అభివృద్ధి అడుగులుపడి కొంతమేర ఆశించిన ప్రయోజనం చేకూరినా రెగ్యులర్ ఈవో లేక నిష్ప్రయోజనంగా మారింది. గతంలో ఏడాదికి ఇరువురు ఈవోలు మారిన పరిస్థితులు నెలకొనగా, దేవాలయ చరిత్రలో నాలుగేళ్లపాటు కొనసాగిన ఈవోగా బాలాజీ శర్మ నిలిచారు.

కొత్తగా వచ్చేదెవరు...!

బాలాజీశర్మ రిటైర్‌మెంట్ నేపథ్యంలో ఆయన స్థానంలో ఎవరిని నియమిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. మల్లన్న కల్యాణంతో మూడునెలల జాతర ప్రారంభం కానుండటంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలనుంచి భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. పూర్తిస్థాయి విధులు నిర్వర్తిస్తూ స్థానికంగా అందుబాటులో ఉండే కార్యనిర్వహణాధికారి లేకపోతే సమస్యలతో పాటు అవకతవకలు చోటుచేసుకుంటాయి. గతంలో ఇన్‌చార్జిల పాలనలో అందనికాడికి దండుకుని ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రవర్తించారు. ప్రస్తుతం దేవాదాయశాఖలో నెలకొన్న పరిస్థితులు, రాజకీయ నేతల ప్రమేయాల దృష్ట్యా వివాదరహితుడిని కార్యనిర్వహణాధికారిని నియమిస్తేనే స్వామివారికి, ఆలయ అభివృద్ధికి ముందుకువచ్చే దాతలు, భక్తులకు సక్రమంగా సేవలందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ ఉన్నతాధికారులతో పాటు స్థానిక నేతలు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇక ఆ 'మల్లన్న'కే తెలియాలి.

కొడిపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం చివరి మంగళవారం ఏకాదశి సందర్భంగా మండలంలోని సదాశివపల్లి శివపంచాయత హనుమాన్ ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, చందన అలంకరణ, శివుడికి పంచామృతాభిషేకాన్ని పురోహితుడు ఉమాశంకర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో సత్య నారాయణ వ్రతం చేయడం శుభ సూచకమన్నారు. పూజ అనంతరం భక్తు లకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వ హించారు. సత్యనారాయణ వ్రతంలో 17 మంది దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నర్సింగరావు, వీరయ్య, జనార్ధన్, నాగరాజు, జోగయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



కోహీర్‌లో ఉదయం పూట వ్యాయామం చేస్తున్న యువకులు

చలికాలం.. చేద్దాం వ్యాయామం

● ఆరోగ్యానికి వ్యాయామం, పోషకాహారం తప్పనిసరంటున్న వైద్యులు

కోహీర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చలిక సాకుతో ఉదయం వేళ ఆలస్యంగా నిద్రలేస్తూ చాలా మంది వ్యాయామం చేయరు. ఇలా చేయడం ఆరోగ్యానికి ఏ మాత్రం సరికాదని నిపుణులు అంటున్నారు. ఏ కాలంలోనైనా తగిన శారీరక శ్రమ ఉంటేనే బద్ధకం తగ్గి ఒంట్లో చురుకుదనం పెరుగుతుందంటున్నారు. ఎముకలు పటిష్టతకు, చలికాలంలో బిగుసుకుపోయే కీళ్లు మామూలుగా తయారవ్వాలన్నా నిత్యం వ్యాయామం చేయాలని చెబుతున్నారు. కొన్ని గంటలపాటు కదలకుండా కూర్చుని ఉద్యోగం చేసే వాళ్లు గంటకోసారి లేచి ఐదునిమిషాల పాటు నడవాలని, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, ముఖ్యంగా విటమిన్ డీ కోసం నిత్యం ఉదయం వేళ సూర్యరశ్మి శరీరానికి తగేలా చూసుకోవడంతో పాటు పాలు, గుడ్లు, చేపలు తరచూ తినాలంటున్నారు.



రోడ్డు పక్కన వ్యాయామం చేస్తున్న యువత

చిరుధాన్యాలను తీసుకోవాలి..

చలి సాకుతో స్నానం మానేయడం అనారోగ్యానికి కారణం అవుతుంది. రెండు పూటలా స్నానం చేయడం, తగినంత తాగునీరు తీసుకోవడం చలికాలంలోనూ అవసరమే. రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలు, వంటి చిరుధాన్యాలు వినియోగంతో శరీరానికి కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, జింకు, భాస్వరం, ప్రోటీన్లు, పీచు, కొవ్వు పదార్థాలు, లవణాలు తగినంతగా అందుతాయి. చిరుధాన్యాలను విరివిగా తీసుకుంటే మధుమేహం, రక్తహీనత, నేత్రవ్యాధులు, మలబద్ధకం, కీళ్లనొప్పులు, నరాల బలహీనత, రుతుస్రావ సమస్యలు రాకుండా ఉంటాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాగే అధిక రక్తపోటు, అల్సర్లు, కిడ్నీలో రాళ్లు, జీర్ణక్రియ, ఎముకల పట్టుత్వం, రోగనిరోధక శక్తి వృద్ధికి చిరుధాన్యాలు ఎంతో మేలు చేస్తాయి.

వాకింగ్‌తో ఆరోగ్యానికి మేలు



చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల శరీరం ఎంతో చురుకుదనంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం శీతాకాలంలో వాకింగ్ వెళ్తాం. దీంతో రోజంతా హుషారుగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలి.

- రాజ్‌కుమార్, స్థానికుడు

వ్యాయామం అవసరం



చలికాలంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం ఎంతో అవసరం. ఈ కాలంలో శరీరంలోని అవయవాలు బిగుసుపోయి నొప్పులు వస్తాయి. వీటిని నివారించేందుకు ప్రతిరోజూ ఉదయం వ్యాయామం చేయాలి.

-అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు

పోషకాహారం తీసుకోవాలి



చలికాలంలో ఎముకల పటిష్టతకు డి-విటమిన్ గల పదార్థాలు తరచూ తీసుకోవాలి. అలాగే ఉదయం వాకింగ్, వ్యాయామం చేసిన తర్వాత తప్పనిసరిగా పాలు, గుడ్లు తీసుకోవాలి.

-నవీన్‌కుమార్, వైద్యుడు

రూ.50 కోట్లతో నల్లవాగు ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ

● రూ.90 కోట్లతో మంజీరా నుంచి వరద కాలువ పనులకు ప్రతిపాదనలు

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి



సిర్గాపూర్ మండలం గోసాయిపల్లి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులకు రూ.50 కోట్లతో ప్రతిపాదనలు అందజేశామని, వారంరోజుల్లో ఈ పనులు మంజూరవుతాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో అభివృద్ధి పనులకు, సీఆర్ఆర్ పథకం కింద రూ.1.79 కోట్లతో మంజూరైన గోసాయిపల్లి రహదారికి, మండల కేంద్రమైన కల్హేర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన సీసీ రహదారుల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కల్హేర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు చెందిన 13 గ్రామాలకు సాగునీరు అందిస్తున్న నల్లవాగు ప్రాజెక్టు పరిధిలోని 11 కిలోమీటర్ల ఎడమ, కుడి కాలువలకు మిగిలిన 4 కిలోమీటర్ల కాలువల ఆధునీకరణకు రూ.50 కోట్లతో ప్రతిపాదనలు అందజేశామని, వారంరోజుల్లో ఈ పనులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నల్లవాగు ప్రాజెక్టులో ఎప్పటికీ సాగునీరు అందుబాటులో ఉంచేవిధంగా సింగూరు బ్యాక్ వాటర్‌లో ఉన్న మంజీరానది నుంచి కాలువ తవ్వే పనులకు రూ.90 కోట్లతో ప్రతిపాదనలు అందజేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని బీటీ రహదారుల అనుసంధానం కోసం రూ.15 కోట్ల సీఆర్ఆర్ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి పీ.చంద్రశేఖర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్, మాజీ ఎంపీపీ మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గుండు నరేందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోచయ్య, నాయకులు యాదవరెడ్డి, వినోద్‌పాటిల్, దేవదాస్, వీర్‌శెట్టి, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలి

● సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బీ.అనురాధ



విద్యార్థిని జయహాసినిని అభినందిస్తున్న సీపీ అనురాధ

గజ్వేల్/సిద్దిపేట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు సదరు రంగాల్లో పిల్లలను ప్రోత్సహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బీ.అనురాధ ఆకాంక్షించారు. గజ్వేల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ సంతోష్‌కుమార్ కుమార్తె జయహాసిని ఎస్‌జీఎఫ్ అండర్-14 జాతీయస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు ఎంపికవగా, మంగళవారం సీపీ అనురాధ జయహాసినిని సన్మానించారు. దేశస్థాయిలో రాణించి, మొదటిస్థానంలో నిలిచి తెలంగాణ, పోలీస్ శాఖ పేరును నిలబెట్టాలని ఆమె ఆకాంక్షించారు. ఆమె వెంట అదనపు సీపీ మల్లారెడ్డి, ఏసీపీ పురుషోత్తంరెడ్డి, మధు, రవిందర్, సంతోష్‌కుమార్, గజ్వేల్ సీఐ సైదా తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: డీఈవో

మాసాయిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మెదక్ డీఈవో రాధాకిషన్‌రావు, టీపీసీసీ కార్యదర్శి ఆవుల ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మాసాయిపేట మండలంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని సూచించారు. కాగా సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు మొదటి, మెదక్ జిల్లా జట్టు రెండో, మంచిర్యాల జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచాయి. ఈ జట్లకు వారు బహుమతులు అందజేశారు.

ఏడుపాయల టెండర్ల ఆదాయం రూ.9.60 లక్షలు

పాపన్నపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి టెండర్ల ద్వారా రూ.9.60 లక్షల ఆదాయం సమకూరింది. మంగళవారం ఆలయ కార్యాలయంలో ఈవో చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ రంగారావు పలు వ్యాపారాలకు సంబంధించిన వేలం నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు వినోదం, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు వేలం వేయగా రూ.9.60 లక్షలు ఆదాయం వచ్చింది. గతేడాది కంటే రూ.49 వేలు అదనంగా ఆదాయం వచ్చింది. ఆలయం వద్ద కొబ్బరికాయల అమ్మకం, ఒడిబియ్యం పోగు చేసుకునేందుకు, ఆలయం వద్ద పూజ సామగ్రి విక్రయించుకునేందుకు వేలం వేయగా.. గతేడాది కంటే తక్కువ పలకడంతో వేలాన్ని వాయిదా వేశారు. కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు, చెప్పుల స్టాండు నిర్వహణ కోసం వేలం వేయగా ఎవరూ లేకపోవడంతో వాయిదా వేశారు. తలనీలాలు పోగు చేసుకునే వేలాన్నీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. వాయిదా వేసిన టెండర్లను త్వరలో నిర్వహిస్తామని ఈవో తెలిపారు. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాం, తదితరులున్నారు.

సంగారెడ్డిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఆర్‌పీల సంఘం జిల్లా అధ్యక్షుడు మరెల్లి దత్తు మాట్లాడుతూ 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు అనిల్‌చారి, ఏపీవో సంతోష్‌కుమార్, నందకుమార్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలతో శ్రామికవర్గం భవిష్యత్ ఆందోళనకరం

● ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ● కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ధర్నా



పటాన్‌చెరులో ఆందోళన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పటాన్‌చెరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలతో దేశంలో శ్రామిక భవిష్యత్ ఆందోళనకంగా మారిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మంగళవారం పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపిన ప్రధాని మోదీ శ్రామికవర్గాన్ని నిర్వీర్యం చేసేవిధంగా కార్మిక చట్టాల్లో సంస్కరణలకు ఆజ్యం పోశారన్నారు. అంబానీ, అదానీల కోసమే తెరవెనక చక్రం తిప్పుతున్న బీజేపీ పెద్దల బండారం బట్టబయలైందన్నారు. సహజ వనరులపై పెట్టుబడిదారులకు గుత్తాధిపత్యం కట్టబెడుతూ సామాన్య ప్రజలకు మాత్రం నిత్యావసరాలు అందుబాటులో లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 29 చట్టాలుగా కుదించి 4 కోడ్లుగా విభజించడం వెనక ఉన్న కుట్రలు బహిర్గతమయ్యాయని చెప్పారు. చివరికి వ్యవసాయంలోకి సైతం కార్పొరేట్ చొరబడి రైతులను నిర్వీర్యం చేసే కుట్రలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఈ ఆందోళనలో ఐఎన్‌టీయూసీ నాయకులు చంద్రమౌళి, విజయ్‌రాజు, అమర్‌యాదవ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెంకటరాజ్యం, శివశంకర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాపన్నపేట/హవేళిఘణపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శానాయిపల్లి గేటు నుంచి ఎల్లాపూర్ గ్రామం వరకు సీఆర్ఆర్ నిధులు రూ.1.50 కోట్లతో బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రజా పాలనను చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తామని తెలిపారు. అంతకుముందు నాగ్సాన్‌పల్లి, అబ్లాపూర్ గ్రామాల్లో పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, నర్సింహులుగుప్తా, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. మెదక్ నియోజక వర్గంలోని గ్రామాలను అన్నివిధాలు అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రావు తెలిపారు. మంగళవారం హవేళిఘణపూర్ మండల కేంద్రంలో రూ.5.40 లక్షలో మంజూరైన సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జక్కన్నపేటలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరశురాంగౌడ్, మాజీ సర్పంచ్ శ్రీకాంత్, రాము, గణేష్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఏదైనా సాధించగలం

● ఎన్‌సీసీ దినోత్సవంలో ప్రొఫెసర్ డీఎస్.రావు ఉద్బోధ



కవాతు నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 26 : క్రమశిక్షణతో దేశంలో మనం ఏ వైఫల్యాలైనా అధిగమించగలమని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు ఉద్బోధించారు. జాతీయ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ నినాదమైన ఐక్యత, క్రమశిక్షణతో క్యాడెట్లు ప్రతి అంశంలో రాణించగలుగుతారని తెలిపారు. ఈ క్రమశిక్షణ వారి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి బలం, ధైర్యం, ఓర్పును అందిస్తాయని చెప్పారు. మనదేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు కృషి చేస్తున్నందున, తక్కువ తలసరి ఆదాయం సవాలు పరిష్కరించే దిశగా ఎన్‌సీసీ క్యాడెట్లు తాము సమకూర్చుకున్న జ్ఞానంతో కృషి చేయాలన్నారు. పౌరుల జీవన ప్రమాణాలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ క్యాడెట్‌గా తన అనుభవాలు, క్యాంపు, భోజన వసతి సౌకర్యాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకలు ఎన్‌సీసీ జెండా వందనంతో పాటు క్యాడెట్ల కవాతుతో ప్రారంభమయ్యాయి. దీని తర్వాత పర్యావరణ ప్రాముఖ్యతను చాటిచెప్పేలా మొక్కలను నాటారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నేపాల్‌లో జరిగిన ఎన్‌సీసీ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ (వైఎల్‌పీ)లో పాల్గొన్న గీతం విద్యార్థిని, క్యాడెట్ అండర్ ఆఫీసర్ మహిత కొండూరిని ప్రొఫెసర్ రావు సత్కరించి, ఒక కోటు, మొక్కను అందజేశారు. ఎన్‌సీసీ క్యాడెట్ ప్రధాన లక్షణాలను జూనియర్ అండర్ ఆఫీసర్ అబ్దుల్ హదీ షరీఫ్ వివరించగా, క్యాడెట్ సంహిత వందన సమర్పణ చేశారు. ఈ వేడుకల్లో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.నారాయణరావు చౌదరి, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ ఎస్.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

● ఝాన్సీలింగాపూర్‌లో ఘటన




దుర్గోళ్ల బాలయ్య (ఫైల్)

రామాయంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి ఝాన్సీలింగాపూర్‌లో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన దుర్గోళ్ల బాలయ్య(26) అలియాస్ బాలు కొంతకాలంగా తాగుడుకు అలవాటు పడి అప్పులు చేశాడు. అంతేగాక తరచూ మద్యం సేవించి రావడంతో కుటుంబంలో కలహాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చిన బాలును తల్లిదండ్రులు మందలించగా వారితో గొడవపడి బయటకు గెంటేశాడు. ఆ సమయంలో తన భార్య కూడా ఇంట్లో లేదు. అనంతరం తాగిన మైకంలో ఇంట్లోని గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తలుపులు ధ్వంసం చేసి.. మహనీయుల చిత్రాలకు రంగులు పూసి..

● శివ్వంపేటలో గుర్తు తెలియని దుండగుల దుశ్చర్య



కలర్ పూసిన సుభాష్ చంద్రబోస్ చిత్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్

శివ్వంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పాఠశాల తలుపులను ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు.. మహనీయుల చిత్రాల మొహాలకు కలర్ పూసి అవమానపరిచారు. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్నది. శివ్వంపేటలోని ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేశాడు. గ్రామానికి చెందిన పులిమామిడి నవీన్‌గుప్తా సుమారు రూ.8 లక్షల సొంత నిధులను వెచ్చించి నిలిచిపోయిన పనులను పూర్తిచేయించారు. మూత్రశాలలు, ప్లంబర్, విద్యుత్ సదుపాయంతో పాటు గోడలకు మహనీయుల చిత్రాలను వేయించి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అన్ని హంగులతో తీర్చిదిద్దారు. కాగా సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు పాఠశాల తలుపులను ధ్వంసం చేసి సుభాష్ చంద్రబోస్ చిత్రానికి ముఖంపైన నల్ల కలర్ వేసి అవమానపరిచారు. నూతనంగా ఏర్పాటుచేసిన బోర్డుపై కలర్లు పూశారు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ శ్రీనివాస్ పరిశీలించి విచారణ చేపట్టారు.



కొత్త బోర్డుపై నల్ల గీతలు గీసిన దుండగులు

కంది సాగు ఆశాజనకం

● కాత, పూత దశలో పంట

● రైతులను భయపెడుతున్న పురుగు బెడద



ఝరాసంగం మండలం బొరెగావ్ శివారులో సాగుచేసిన కంది పంట

ఝరాసంగం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని బొరెగావ్, నర్సాపూర్, దేవరంపల్లి, సిద్ధాపూర్ తదితర గ్రామాల్లో కంది పంటను అధికంగా సాగుచేశారు. ఈ సంవత్సరం కురిసిన వర్షాలకు తట్టుకొని పంట ఆశాజనకంగా.. పూత, కాత దశలో ఉంది. ఝరాసంగం మండలంలో 4 వేల ఎకరాల్లో కంది సాగవుతోంది. ఉదయం పొగమంచు పడుతుండడంతో కొంతమేర పూత దెబ్బతిని, పచ్చపురుగు బెడద అధికంగా కనిపిస్తోంది. పంటను కాపాడుకునేందుకు రైతులు రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. సంబంధిత అధికారులు సూచనాలు, సలహాలు ఇవ్వకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అంతర పంటగా కంది

ప్రతి ఏడాది రైతులు కందిని అంతర పంటగా సాగుచేస్తారు. ఖరీఫ్‌లో పెసర, మినుము, సోయాబీన్ పంటలతో పాటు కందిని వేస్తారు. మొదట పెసర, మినుము, సోయాబీన్ పంటలు చేతికి వస్తాయి. తరువాత రబీలో కంది పంటను రైతులు కోత చేస్తారు. పెసర, మినుము, సోయా పంట వల్ల భూమి సారవంతంగా మారుతుంది. దీనివల్ల పంటల దిగుబడి అధికంగా వస్తుంది. ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురవడంతో పెసర, మినుము, సోయా పంటల దిగుబడి తగ్గడంతో రైతులు కంది పంటపైన ఆశలు పెట్టుకున్నారు.

పెరిగిన మద్దతు ధర

ప్రభుత్వం కంది పంటకు మద్దతు ధర పెంచింది. గతేడాది ధర రూ.6,300 ఉండగా, ఈసారి రూ.7,550గా ప్రకటించింది. అయితే ఈ సంవత్సరం రూ.1250లు ఎక్కువగా అందజేస్తుంది. పత్తి పంట కంటే కందికే అధిక ధర ఉంది.

పంటకు పచ్చపురుగు బెడద

కంది పంట మొగ్గ, పూత దశలో ఉండడంతో పచ్చపురుగు ఉధృతి అధికంగా ఉంది. దీనికితోడు పొగ మంచు పడడం వల్ల పూత రాలుతుంది. అదేవిధంగా చీడపీడలు బెడద పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సలహాలు, సూచనాలు ఇవ్వాలి

క్లస్టర్‌వారీగా విధులు చేపడుతున్న వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో పంటను పరిశీలించి ఎలాంటి మందులను పిచికారీ చేయాలనే విషయాలపై సలహాలు ఇవ్వాలి. కానీ రైతువేదికలకే పరిమితం కావడంతో రైతులు ఫర్టిలైజర్ యాజమాన్యం అందజేసిన మందులను పిచికారీ చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు సాయం

చిన్నకోడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూరిపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సాయం అందించారు. ఆలయ నిర్మాణానికి సాయం అందించాలని ముదిరాజ్ సంఘం సభ్యులు ఆయన్ను కోరారు. ఈ మేరకు ఆయన రూ. 60 వేల విలువ గల గ్రానైట్‌ను ఇప్పించగా మంగళవారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు ముదిరాజ్ సంఘం సభ్యులకు అందజేశారు.

ఎంబ్రాయిడరీ కిట్స్ పంపిణీ

దూళిమిట్ట,నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలపల్లిలో 30 మంది మహిళలకు మాజీ జడ్పీటీసీ, టీపీసీసీ కార్యదర్శి సభ్యులు గిరికొండల్‌రెడ్డి ఉచితంగా ఎంబ్రాయిడరీ కిట్స్ పంపిణీ చేశారు.

డ్రంకన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి గతంలో సిద్దిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఏడుగురు మద్యం సేవించి పట్టుబడ్డారు. మంగళవారం వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ చేసి ఏడుగురికి రూ.12,500 జరిమానా విధించారు.

నిఘానేత్రాలపై చిన్నచూపేలా!?

- పని చేయని సీసీ కెమెరాలు
- కేసుల పరిష్కారంలో వాటి పాత్ర కీలకం
- మరమ్మతులు చేపట్టడంలో జాప్యం


సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై కానరాని దృశ్యాలు, ఇన్‌సెట్‌లో పనిచేయని కెమెరాలు

సిద్దిపేట రూరల్, సిద్దిపేట రూరల్ 26 (ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని పోలీసు అధికారులు చెబుతుంటారు. అందుకు తగ్గట్టుగా ప్రజాప్రతినిధులు, దాతలు, వ్యాపారులు, గ్రామస్థుల సహకారంతో సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని గ్రామాల్లో గతంలో వందల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

అలంకారప్రాయంగా

సీసీ కెమెరాల ద్వారా పలు ప్రమాదాలను గుర్తించడంతో పాటు నేరస్థులను గుర్తించడంలో అవి కీలకంగా ఉపయోగపడతాయి. కానీ మండలాల్లోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు మూలనపడ్డాయి. ఎప్పటికప్పుడు పరిశీలించి పట్టించుకోవాల్సిన గ్రామ పంచాయతీ అధికారులు, పోలీసు అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రధాన చౌరస్తాల్లో, ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలలు పనిచేయడంలేదని, అధికారులు వాటికి మరమ్మతులు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పని చేయని కెమెరాలతో నిఘా వ్యవస్థ పదిలమేనా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పైపై మరమ్మతులతో మమ

గ్రామాల్లో ఇప్పటికే పలు సంఘటనలు జరిగినప్పుడు ఆధారాల కోసం పరిశీలించాల్సిన సీసీ కెమెరాలు లేకపోవడంతో కేసులు పక్కదారి పడుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు మండలాల్లో వందల సంఖ్యలో ప్రభుత్వ నిధులు, దాతలు సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణలో అధికారులు పైపై మరమ్మతులు చేయిస్తూ చేతులు దులుపుకుంటున్నారంటున్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, ఇర్కోడు, తోర్నాల, చింతమడకతో పాటు నారాయణరావుపేట మండల కేంద్రంలో, మాటిండ్ల, గోపులాపూర్ పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు పని తీరు అలంకారప్రాయంగా మారింది.

ఎన్నిసార్లు విన్నవించినా..

సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించాలని గ్రామాల ప్రజలు విన్నవించినా నిధులు లేవని సాకుతో అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో సిద్దిపేట రూరల్ పోలీసులు కొంత మేర మరమ్మతులు చేయించినప్పటికీ అది మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. అదే దారిలో సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో ఇదే తంతు కొనసాగుతుందని పలువురు చెబుతున్నారు. పోలీసు అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని మరికొన్ని సంఘటనలు, ప్రమాదాలు జరగకముందే సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనును వివరణ కోరగా.. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, దాతలు, గ్రామస్థులను భాగస్వాములను చేసి సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలను గుర్తించి త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

రాంగ్ రూట్‌లో వచ్చి బస్సును ఢీకొట్టిన ట్రాక్టర్

- బస్సు డ్రైవర్ పరిస్థితి విషమం


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిని డ్రైవర్

కుకునూరుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను డ్రైవర్ రాంగ్ రూట్‌లో నడిపి ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో పాటు పలువురు ప్రయాణికులకు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి కుకునూరుపల్లి నుంచి ఓ ట్రాక్టర్‌లో డ్రైవర్ వరి ధాన్యంతో రాంగ్ రూట్లో వెళ్తూ హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ పరిస్థితి విషయంగా ఉంది. అలాగే బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడగా ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి


గజ్వేల్: పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

గజ్వేల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకాన్ని ప్రజలు సద్వినియెగం చేసుకోవాలని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి సూచించారు. గజ్వేల్ మండలంలోని అక్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలు, భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పనుల జాతర కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఆయనవెంట మండల ప్రత్యేకాధికారి సువర్ణ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో దయాకర్, ఏపీవో సురేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ లలిత, ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి, మాజీ సర్పంచ్ బాల్‌చంద్రం, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

● మద్దూరు: మండలంలోని రేబర్తిలో ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధిహామీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మాదవ్ జాదవ్ వైద్యాధికారి సువర్ణసన్, ఎఫ్ఏ అయిలయ్య, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● కుకునూరుపలి: మండల వ్యాప్తంగా గ్రామాల్లో పనుల జాతర, ప్రజా విజయోత్సవ, రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఉపాధిహామీ పథకం ద్వారా వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని అధికారులు, నాయకులు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని పలువురు అన్నారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


దుబ్బాక: రాజక్కపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


సిద్దిపేట క్రైం: జిల్లా కోర్టు ఆవరణలో భారత రాజ్యాంగ ప్రవేశికను చదువుతూ ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి


సిద్దిపేట క్రై: కమిషనర్ కార్యాలయంలో అంబేడ్కర్, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీ అనురాధ

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

జగదేవ్‌పూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని గజ్వేల్ న్యాయ సేవా కమిటీ అధ్యక్షురాలు, జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ప్రియాంక సూచించారు. ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయ అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. సమాజంలో తమకు దక్కవలసిన న్యాయాన్ని పొందలేని నిస్సహాయ స్థితిలో ఉన్న ఎవరైనా కోర్టు ఫీజు చెల్లించకుండా కోర్టులో ఉన్న న్యాయ సేవా కమిటీలను మామూలు దరఖాస్తులతో ఆశ్రయిస్తే తగిన న్యాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు బింగి భాస్కర్, కుమార్, సురేంద్ర, తలారి దుర్గయ్య, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, ఏఎస్ఐ రమణారెడ్డి ఉన్నారు.

విధుల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


వైద్యులతో మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): "నెలకు 70 నుంచి 80 లక్షల నిధులు జీతాలకే ఖర్చు అవుతున్నాయి, రోజుకు 70 మందికి కూడా వైద్యసేవలందించరా..? విధులపట్ల ఇంతనిర్లక్ష్యమా...?" అంటూ దుబ్బాక వందపడకల ఆసుపత్రి వైద్యసిబ్బందిపై ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అసంతృప్తిని వ్యక్తం చేశారు. సిద్దిపేట నుంచి బస్సులు సమయానికి రావని వైద్యసిబ్బంది ఇచ్చిన సమాధానానికి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "స్థానికంగా ఉండకుండా, సిద్దిపేట నుంచి వస్తే, అక్కడే ఉద్యోగం చూసుకొండి. లేదంటే, విధుల్లో సమయపాలన పాటించండి" అంటూ ఆయన హెచ్చరించారు. దుబ్బాక వందపడకల ఆసుపత్రి సమీక్ష సమావేశాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ వివరాలను ఆయనను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు స్థానికులే ఉండాలని కోరారు. పారిశుధ్యం కూడా సక్రమంగా ఉండటంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు సక్రమంగా వైద్యం అందించకుంటే ఎలా అని ప్రశ్నించారు. అత్యవసర సేవలకు సిద్దిపేటకు పంపిస్తే, దుబ్బాకలో ఇంతమంది వైద్యులు ఉండీ ఏం లాభమని ప్రశించారు. ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపడాలని ఆయన ఆదేశించారు. ఆయనవెంట రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ హేమరాజ్, ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే పల్లా


చేర్యాల: కిష్టంపేటలో పాంపండ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడుతున్నట్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న పాంపండ్, చేర్యాల మండలం దానంపల్లిలో రూ.44లక్షల వ్యయంతో గ్రామపంచాయతీ, లైబ్రరీ భవన నిర్మాణం పనులకు శంకుస్థాపనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన వాగ్దానాలను ప్రాధాన్యత క్రమంలో నెరవేర్చుతూనే గ్రామాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఏడీఏ రాధిక, క్లస్టర్ ఏపీడీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో రామ్మోహన్, తహసీల్దార్ ఎండీ ఏజే రహీంఅధికారులు, నాయకులు తదితరులున్నారు.

● మద్దూరు: మండలంలోని సలాఖ్‌పూర్‌లో ప్రజాపాలన-ప్రజా వియోత్సవాలు, భారత రాజ్యాంగ దినోత్సవంతో పాటు ఉపాధిహామీ పథకం పనుల ప్రారంభానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● దూళిమిట్ట: మండలంలోని లింగాపూర్‌లో పశువుల పాక నిర్మాణానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులున్నారు.

సప్లిమెంటరీ ఓటరు జాబితా ప్రకటన

- గజ్వేల్ ఎంపీడీవో, రాయపోల్ తహసీల్దార్

గజ్వేల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించిన సప్లిమెంటరీ ఓటరు జాబితాను నోటీసు బోర్డులో ప్రచురితం చేసినట్లు గజ్వేల్ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని కోరారు.

● రాయపోల్: పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలను రాయపోల్ తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం నోటీసు బోర్డులపై ప్రచురణ చేసినట్లు రాయపోల్ తహసీల్దార్ దివ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న పట్టభద్రులు వారి వారి పేర్లు ఓటరు జాబితాలో సరిచేసుకోవాలని పేర్కొన్నారు.

మల్కంబ్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

సిద్దిపేట రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నారాయణరావుపేట మండల కేంద్రంలో ఉమ్మడి మెదక్ జిల్లా మల్కంబ్ పోటీల్లో సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మంజుభార్గవి తెలిపారు. అండర్-14, 17 విభాగంలో ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని అభినందించారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- డీఆర్డీవో పీడీ జయదేవ్‌ఆర్య

బెజ్జంకి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేయాలని డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న వడ్లకు ప్రభుత్వం రూ. 2,300 మద్దతు ధర తో పాటు 500 రూపాయల బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. సన్న వడ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం నర్సయ్య, ఏవో సంతోష్, ఏఈవో రేణుక, ఐకేపీ సీసీ సారయ్య, వీవోఏలు భారతి, లత పాల్గొన్నారు.

'ఎన్‌సీసీతో దేశభక్తి, క్రమశిక్షణ'


కెడెట్లకు ర్యాంకులను ప్రదానం చేస్తున్న వైస్‌ప్రిన్సిపాల్

గజ్వేల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతో దేశభక్తి, క్రమశిక్షణ అలవడుతుందని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించగా, ఆర్మీ రిటైర్డ్ హవల్దార్ సురేందర్‌రెడ్డి, నీల చంద్రం అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీలో ఆయా విభాగాలకు చెందిన కెడెట్లకు ర్యాంకులను ప్రదానం చేశారు. వారి వెంట ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి, వెంకటేశం, మహేందర్, విజయభాస్కర్‌రెడ్డి, రాంచంద్రం, అలివేలు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

'ప్రజాసంకల్ప దీక్షకు తరలిరావాలి'

చేర్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30ను చేర్యాలలో నిర్వహించే ప్రజాసంకల్పదీక్షకు తరలిరావాలని జేఏసీ కో-కన్వీనర్ ఒగ్గు రాజు, రాజకీయ వ్యవహారాల సంప్రదింపుల కమిటీ సమన్వయ కర్త అందె బీరయ్య కోరారు. కొమురవెల్లి మండలకేంద్రంలో జేఏసీ కన్వీనర్ చెరుకు రమణారెడ్డి అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. చేర్యాల ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూర్వవైభవ సాధనకు పాటుపడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తడక లింగమూర్తి, కడిక్యాల బాలమోహన్, ర్యాకం ప్రభాకర్, దొంతరబోయిన లక్ష్మి, ఎల కనకలక్ష్మి, చుంచు శ్రీనివాస్, ఉప్పల వంశీకృష్ణ, ఉప్పల చంద్రశేఖర్, మాంకాల నగేశ్, ఎదుల గణేశ్, మల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిరసన


కస్తూర్బా ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

వర్గల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చెయ్యడంతో పాటు పే స్కేల్ అమలు చేయాలని రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం వర్గల్ మండల శాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా ఉద్యోగులంతా నల్లబ్యాడ్జిలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి మాట్లాడుతూ.. గత సంవత్సరం సెప్టెంబరులో సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తున్న సందర్భంగా హన్మకొండలోని సమ్మె శిబిరానికి అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు తెలిపారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నెల రోజుల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్నారన్నారు.

హిమోఫిలియా బాధితులకు మెరుగైన వైద్యం

- సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్


సమావేశంలో మాట్లాడుతున్న విమలాథామస్

సిద్దిపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హిమోఫిలియా బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామని సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్, ప్రముఖ లిటిల్ స్టార్ పీడియాట్రిక్, మహిళల ఆసుపత్రి పీడియాట్రిక్, హెమోటో ఆంకాలజిస్ట్ డాక్టర్ రమణ దండమూడి అన్నారు. సిద్దిపేట పట్టణంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో హిమోఫిలియా వ్యాధిపై హిమోఫిలియా సొసైటి పెద్దపల్లి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిమోఫిలియా వ్యాధి జన్యుపరమైన రక్త సంబంధిత వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి 50 వేల మందిలో ఒకరికి వస్తుందని, వ్యాధి బారిన పడినవారికి ఏ కారణం లేకుండానే శరీరంలో నుంచి రక్తస్రావం జరుగుతుందని వివరించారు. రోగులకు రక్తస్రావం జరిగితే 2 నుంచి 6 ఇంజెక్షన్లు తీసుకోవాలని, ఒక్కో ఇంజక్షన్ ధర రూ. 5వేల వరకు ఉంటుందని చెప్పారు. ఆ ఇంజక్షన్‌ను పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో ఉచితంగా అందజేస్తామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శాంతి, వైద్యులు సురేష్‌బాబు, జ్యోతి, మాధవరావు, నోడల్ ఆఫీసర్ గీత, నరేష్, క్రాంతికుమార్, విమల, నోవా నార్డిస్క్ కంపెనీ ప్రతినిధి ముత్యాల విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీని వేగవంతం చేయాలి

- మండల ప్రత్యేకాధికారి కవిత


డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

వర్గల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి కవిత అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంటీ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డేటా ఎంటీ ఆపరేటర్లు సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ప్రతీ డేటా ఎంటీ కేంద్రంలో విద్యుత్ అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవలని, లేదా అందుకు అవసరమైన పవర్ సిస్టంను ఏర్పాటు చేయ్యాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల్‌రాజ్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్ఐ రాజు తదితరులు ఉన్నారు.

'ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌కో ఏడీని సస్పెండ్ చేయాలి'

సిద్దిపేట అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాడయిపోయిన వస్తువులతో పని చేయించి కార్మికుడు ప్రమాదబారిన పడడానికి కారణమైన ట్రాన్స్‌కో ఏడీ రాందాస్‌ను సస్పెండ్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాల స్వామి డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికుడిని మంగళవారం సిద్దిపేట ఆస్పత్రిలో పరామర్శించి ఆయన మాట్లాడారు. నంగునూరు మండలంలోని పాలమాకులలో పాడుబడిన తాడుతో పనిచేస్తూ తాడు తెగి పడటంతో కార్మికుడు గాయాలకు గురైనట్లు చెప్పారు. సేఫ్టీ పరికరాలు వాడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ గుంటుపల్లి సుధాకర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, నాయకులు సుధాకర్, కర్ణాకర్ ఉన్నారు.

విద్యార్థిని మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి: బీఆర్ఎస్వీ


బెజ్జంకి: మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

బెజ్జంకి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని శైలజ మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు రావుల రాజు, కొరివి తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ విద్యాలయాల్లో నిర్లక్ష్యం కనిపిస్తున్నదన్నారు. అధికారుల అలసత్వంతో విద్యార్థుల ప్రాణాలు పోతున్నాయని మండిపడ్డారు. గిరిజన విద్యార్థిని మృతికి ప్రభుత్వం బాధ్యత వహించి ప్రభుత్వపరంగా విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేష్, మహేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు

● సిద్దిపేట కల్చరల్: గిరిజన పాఠశాల విద్యార్థిని శైలజ మృతి పట్ల బీఆర్ఎస్వీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం రోజునే విద్యార్థిని మృతి విచారకరమని జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి మండల నాయకులు గుజ్జరాజు, బండి శ్రీకాంత్, ఇరుగంటి రమేష్ అన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు శైలజ చిత్రపటానికి బీఆర్ఎస్వీ నాయకులు నివాళులర్పించారు.

కాసుపత్రులపై కొరడా

5వ పేజీ తరువాయి..

మరికొన్ని ఆస్పత్రుల్లో ఒక డాక్టర్‌కు బదులుగా మరొకరు పరీక్షించి ప్రిస్కిప్షన్ రాసే పద్ధతి నడుస్తోంది. బోర్డులపై డాక్టర్ల పేర్లు, హోదా, అనుభవం, వారు చదువుకున్న కాలేజీ, యూనివర్సిటీ గురించి గొప్పగా రాస్తుండగా... వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటుంది. బోర్డుపై పేర్లు చూసి వస్తున్న రోగులకు మాత్రం దిమ్మతిరిగేలా నిజాలు తెలుస్తున్నాయి. సీనియర్ డాక్టర్‌కు బదులు జూనియర్ డాక్టర్లు సేవలందిస్తున్నారు. ఇక కొందరు పాలీ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యుల పేరిట నిర్వాహకులు, ఆర్ఎంపీలు, కంపోండర్లే సేవలందిస్తున్నారు. కొత్తగా డీఎంహెచ్‌వో, ఇతర అధికారులు వీటన్నింటిపై దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేయాల్సి అవసరం ఉంది.

అవసరం లేకున్నా టెస్టులు, స్కాన్‌లు..

సాధారణ రోగానికి కూడా ఎడాపెడా టెస్టులు చేస్తున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున ఉన్నాయి. సిద్దిపేటలోని ఒకరిద్దరు సీనియర్ డాక్టర్లు రోగులను పరీక్షించి మందులు రాస్తుంటారని, మిగితావారు మాత్రం సాధారణ జ్వరానికి కూడా 5 రకాల టెస్టులకు పంపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలానా వైద్యుడి నుంచి ల్యాబ్‌కు, డయాగ్నోస్టిక్ సెంటర్‌కు చిట్టి వచ్చిందంటే ఆ డాక్టర్ పేరిట కమిషన్ డబ్బులు జమచేసి అప్పగిస్తున్న పరిస్థితి నెలకొంది. అందుకే మెజార్టీ ఆస్పత్రుల్లో వైద్యులు టెస్టులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. తమ పరిజ్ఞానంతో రోగం తీవ్రతను గుర్తించినప్పటికీ మందులు రాయకుండా.. కమిషన్ల కోసం టెస్టులను తప్పక జత చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఫలితంగా అమాయక ప్రజలకు వైద్యం ఖర్చులు భారమవుతున్నాయి. ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్ల దందా మాత్రం 'మూడు పువ్వులు ఆరు కాయల' మాదిరిగా లాభసాటిగా మారింది. ఈ పరిస్థితిపైనా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు కన్నేయాల్సిన అవసరం ఉంది.

మచ్చుకు కొన్ని సంఘటనలు...

సిద్దిపేట పట్టణంలో వైద్యుడిగా చలామణి అయిన ఓ వ్యక్తికి సరైన విద్యార్హతలు లేకపోవడంపై కొంతమంది ప్రశ్నించగా నీళ్ల నమిలి అడ్రస్ లేకుండా పోయాడు. అదే విధంగా అబార్షన్‌ల పేరిట దుకాణం తెరిచిన మరో నకిలీ డాక్టర్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. మరో ఆస్పత్రిలో ఓ ఇంటర్ విద్యార్థి కుడిచేతి చిటికెన వేలుకు గాయం కాగా.. సర్జరీ పేరిట వేలుకు బదులు చేతికే సమస్య వచ్చేలా చేసి చివరకు వైద్యుడే ఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక సర్జరీలు విఫలమై సిద్దిపేటలోని పలు ఆస్పత్రుల్లో మృతిచెందిన వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. మృతుల కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తే నష్టపరిహారం ఇచ్చి తమ తప్పులను కడుక్కునే ప్రయత్నం చేశారు. సరైన అర్హతలు లేని వైద్యులతోపాటు నిబంధనలు పాటించని బడా ఆసుపత్రులపైనా కొత్త డీఎంహెచ్‌వో తనిఖీలు చేపట్టాలనే ప్రజలు కోరుతున్నారు.